ముస్లిం సోదరులకు నిత్యావసర సరుకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బక్రీద్ పండుగ సందర్భంగా పావులూరి ప్రుథ్వీ, సామాజిక సేవా రత్న అవార్డు గ్రహీత, రోటరీ క్లబ్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు (కెఎస్ఆర్)ల సహకారంతో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోబాల్డ్‌పేటలోని పేద ముస్లిం సోదరుకు 10 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు ఎన్.రామారావు, సెక్రెటరీ వై.రమణబాబు, డైరెక్టర్ మిత్రా, జాయింట్ సెక్రటరీ శివాజీ, మెంబర్స్ ఉమా మహేశ్వరరావు, మానవత రక్తదాన కమిటీ చైర్మన్ మద్దినేని సుధాకర్, లాఫింగ్ క్లబ్ ప్రెసిడెంట్ షేక్.లాల్ వజీర్, లాఫింగ్ క్లబ్ సభ్యులు, మసీదు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని పొన్నూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్ఆర్ఈఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 1.80 లక్షలతో పాటు డ్వాక్రా ఋణం అందిస్తుందని, లబ్దిదారులకు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని సూచించారు. గృహ నిర్మాణం చేపట్టడం వలన గ్రామ స్థాయిలోనే ఉపాధి హామీ పనులు కూడా కూలీలకు కల్పిస్తారని సూచించారు. వివిధ దశల్లో జగనన్న కాలనీ నిర్మాణానికి ప్రభుత్వం అందించే నగదును వివరించారు. నూరు శాతం జగనన్న కాలనీల నిర్మాణం చేపట్టేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, ఎన్ఆర్ఆస్ఈజీఎస్ ఏపీవో గణపతి పాల్గొన్నారు.

'జీవీఆర్ అండ్ ఎస్'లో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ఉద్యోగ నియామక ప్రక్రియలో 73 మంది విద్యార్థిని, విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.కరీమున్నీసా తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు పెంపొందిచే విధంగా కళాశాలలో నైపుణ్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ బాబు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కుశల్ కుమార్, కళాశాల డీన్ డాక్టర్ బి.వరప్రసాద్ విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ రిక్రూటర్స్ ఎ.శివకోటయ్యచారి, జి.సాయి ప్రవీణ్, కళాశాల ప్లేస్ మెంట్ అధికారి వి.ప్రశాంత్ బాబు, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తొలి తెలుగు ప్రధానికి నివాళి

విశాలాంధ్ర-తెనాలి : బుధవారం తెనాలి పాత స్వరాజ్‌టాకీస్ వద్ద తెనాలి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో మాజీ భారత తొలి తెలుగు ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు 102వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తరల్లావఝుల పురుషోత్తం మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన పి.వి. దేశ అత్యున్నత పదవి అయిన ప్రధాని పీఠాన్ని అధిష్టించిన తొలి తెలుగు ప్రధాని అని తెలుగుజాతికి ఆయన గర్వకారణమన్నారు. ఆర్థికవ్యవస్థను మెరుగు పరచి భారతదేశాన్ని అభివృద్ధి బాటలో నడిపారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎనమండ్ర సురేష్ మాట్లాడుతూ తెనాలిలో బహుభాషా కోవిదుడు అపరచాణుక్యుడు పి.వి.నరసింహారావు జన్మదిన వేడుకలు జరపడం అభినందనీయమన్నారు. విష్ణుభొట్ల వారు కరోనా సంక్లిష్ట పరిస్థితుల్లో సమాజానికి సేవచేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పరశురాం, ఎస్.వరలక్ష్మి, పి.వి.రాంగోపాల్, శ్రీనివాస్, గోపాల్, శ్రీనివాసాచారి ప్రభృతులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టం అమలులో..

విశాలాంధ్ర, తెనాలి : ఆంధ్రప్రదేశ్ 1977 సంవత్సరపు గోవధ నిషేధ చట్టం తెనాలి పట్టణంలో అమలులో ఉందని ఆవులను, ఒంటెలను వధించరాదని మునిసిపల్ కమిషనర్ యం.జశ్వంతరావు తెలిపారు. బక్రీద్ పర్వదినము పురస్కరించుకొని పట్టణంలో ముస్లిం పెద్దలతో మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆవులను, దూడలను, పాలిచ్చే గేదెలను, ఎద్దులను కానీ వధించిన యెడల గోవధ నిషేధ చట్టంక్రింద శిక్షింపబడతారని ఆయన చెప్పారు. కబేలా నందు వెటర్నరీ డాక్టర్ పరీక్ష జరిపిన తరువాతే వేట మాంసం కొనుగోలు, అమ్మకాలు చేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కె.హెచ్. నిర్మల అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, ముస్లిం సోదరులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నాలు

విశాలాంధ్ర-తాడేపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల పిలుపు మేరకు జూన్ 30న విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని బుధవారం తాడేపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సిపిఐ ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. 30న నులకపేట, సీతానగరం సెటిల్మెంట్ విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాల్లో వినియోగదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కొట్టె కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, గంజి శ్రీనివాసరావు, బిట్ర రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనాదక్షుడు పీవీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు నేలపై పుట్టి ఎన్నో సంస్కరణలకు బీజం వేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మహా మేధావి, అజాత శత్రువు, పరిపాలనా దక్షుడని విద్యావేత్త ఆర్వీ సింగరయ్య కొనియాడారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సింగరయ్య మాట్లాడుతూ పీవీ నరసింహారావు మనదేశానికి 9వ ప్రధానిగా ఉన్న కాలంలో భారతదేశ రాజకీయ, సామాజిక రంగాల్లో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. దివాళా స్థాయికి చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించేందుకు ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన అపర ఛాణుక్యుడు పీవీ అని కొనియాడారు. ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ పీవీ ఏపీకి సీఎంగా బాధ్యతలు చేపట్టి ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, సదాశివం, జయకుమార్, సుబ్బారెడ్డి, గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి యువజన సమ్మేళనం దృశ్యమాలిక

'కాషాయసారం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, లెనిన్‌బాబు, రాజేంద్ర, నరసయ్య, పెంచలయ్య, చంద్రానాయక్, సురేష్

మాట్లాడుతున్న చంద్రశేఖర్

పాట-మాట కార్యక్రమంలో నరసయ్య

గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

జిల్లాలో 1,59,594 మందికి అమ్మఒడి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నాల్గవ విడత అమ్మ ఒడి కార్యక్రమం క్రింద జిల్లాలో 1,59, 594 మంది తల్లుల ఖాతాలకు 239 కోట్ల 39 లక్షల 10 వేల రూపాయలు జమ చేస్తామని కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న అమ్మ ఒడి నాల్గవ విడత నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలకు పార్వతిపురం మన్యం జిల్లా కురుపాంలో బటన్ నొక్కి జమచేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంను జిల్లా కలక్టరేట్ లోని శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యులు లక్ష్మణ రావు, చంద్రగిరి ఏసురత్నం, శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర రావు, కిలారి వెంకట రోశయ్య, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మెన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు, నెడ్ కాప్ డైరెక్టర్ చిన్నప రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ సజీలా, తాడికొండ నియోజకవర్గ ఇన్ చార్జ్ కత్తెర సురేశ్ కుమార్ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని అన్నారు. బడులు ప్రారంభమయిన రోజునే విద్యార్థులకు విద్యాకానుక క్రింద కిట్లను అందరికి అందించడం జరిగిందన్నారు. గోరు ముద్ద కార్యక్రమం ద్వారా మంచి రుచికరమైన పోషకాహారంతో పాటు రాగి జావ కూడా విద్యా ర్థులకు అందిస్తున్నామని, మన బడి నాడు నేడు క్రింద మొదటి విడతలో అధునాతమైన మౌలిక వసతులు కల్పించడం, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేసి ఆధునిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో విద్యను మరింతగా ప్రోత్సహిం చేందుకు ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో ర్యాంకులు పొందిన వారికి పారితోషికంతో పాటు మెమోంటోలు అందించడం జరిగిందన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లులకు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, డిఈఓ శైలజ, సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ ఝాన్సీ, ఏ.పి టిడ్కో సభ్యురాలు నాగేశ్వరి, ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఖాసిం, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

అధికారుల సమిష్టి కృషితోనే తెలుగు అమలు: విజయబాబు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ కార్యాలయాల్లో పాలనా భాషగా తెలుగు అమలు అధికారుల సమిష్టి కృషి ద్వారానే సాధ్యం అవుతుందని రాష్ట్ర అధికార భాషా సంఘం గౌరవ అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్సీ సమావేశ మందిరంలో ప్రభుత్వ శాఖల్లో అధికార భాష అమలు తీరును రాష్ట్ర అధికార భాష సంఘం గౌరవ అధ్యక్షులు పి.విజయబాబు, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర అధికార బాషా సంఘం సభ్యులు జయ చంద్రారెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ అమృతతుల్యమైన తెలుగు బాషా తల్లి గర్భం నుంచే తెలుగు ప్రజలకు అంతర్లీనంగానే పూర్తి అవగాహన ఉంటుందన్నారు. అత్యధికంగా భాషా అభిమానం ఉన్న తమిళ ప్రజలు సైతం తెలుగులో ఉన్న త్యాగరాజ కృతులను బృందంగా గానం చేస్తున్నారన్నారు. తెలుగు భాషలోని సామెతలు, పదాలు మరుగునపడిపోతున్నాయని, పదాలను తరచుగా ఉపయోగించడం ద్వారా పూర్వవైభవం తీసుకురావచ్చునన్నారు. తెలుగు భాష వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సజీవ స్రవంతి అయిన తెలుగు బాషాపై విమర్శలు చేయటం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పేదకుటుంబాల్లోని పిల్లలకు అంతర్జాతీయ స్థాయిలో విద్యాబోధన అందించటానికి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తూ పాఠ్యాంశాలలో తెలుగు భాషసంస్కృతిని పొందుపరిచారన్నారు. ప్రభుత్వ శాఖలలో నిర్వహించే ఉత్తర ప్రత్యుత్తరాలు సామాన్య ప్రజలకు సౌలభ్యం, సౌకర్యంగా ఉండేందుకు తెలుగు వ్యవహారిక భాష ద్వారా జరపాలన్నారు. న్యాయ స్థానాలు వెలువరించే తీర్పులను సైతం తెలుగులో ఇవ్వాలన్న అంశంపై చర్చిస్తామన్నారు. తెలుగు భాషను తక్కువ శాతం అమలు చేస్తున్న శాఖల అధికారులే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలలో తెలుగును పాలన వ్యవహారాలలో పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధికార బాషా సంఘం సూచనలు మేరకు జిల్లాలో తెలుగు సాహిత్యం, బాషాభిమానం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు త్వరలోనే ప్రత్యే కంగా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెవెరా హోమియో సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి: నగరంలోని శాసన స్తంభం ఎదురు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చేవెరా హెూమియో సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ మంగళగిరిలో చెవేరా హెూమియో సెంటర్ సేవలు ప్రారంభం కావటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఆప్కో చైర్మన్ చిరంజీవి మాట్లాడుతూ హెూమియో మందుల కోసం విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మంగళగిరిలోనే ఈ తరహా కేంద్రం ప్రారంభం కావడం శుభ పరిణామం అని తాము కూడా హెూమియో మెడిసిన్‌ను వినియోగిస్తామని అన్నారు. చెవెరా హెూమియో సెంటర్ మంగళగిరి బ్రాంచ్ మేనేజింగ్ డైరెక్టర్ చెన్నపాటి వెంకటేశ్వర రాజు మాట్లాడుతూ చెవెరా హెూమియో మందులే కాకుండా అన్ని కంపెనీల హెూమియో మందులు లభిస్తాయని అన్నారు. 3 రోజుల పాటు ఉచిత కన్సల్టేషన్ వసతి కల్పిస్తున్నామని అన్నారు. మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలు హెూమియో సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు నాయకులు గుండా మధు, హెూమియో సెంటర్ ఫార్మాసిస్ట్ ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన జపాన్ ఐటీ కన్సల్టెన్సీ బృందం

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో విధ్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు తమ ఐటి కంపెనీలలో ఉద్యోగాలను కల్పించడానికి జపాన్‌కు చెందిన జిఐటి కన్సల్టెన్సీ మానవ వనరుల విబాగానికి చెందిన కార్పొరేషన్ (జపాన్ బెస్ట్ కంపెనీ) ప్రతినిధులు బుదవారం వడ్డేశ్వర్యంలోని కెఎల్ వర్శిటీ గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌ను సందర్శించారు. మానవ వనరుల ముఖ్య అధికారి యుజిసెకగుచి, సెలక్టింగ్ కమిటీ సభ్యులు టకుయకగొటని, హెునొక కటొ లతో పాటు చెన్నైకు చెందిన సెంథిల్ సెల్లప్పన్ అనే జపాన్ ప్రతినిధులు వర్శిటీలోని ప్లేస్‌మెంట్స్, అకడమిక్ టీమ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాల కల్పనల డీన్ డాక్టర్ ఎన్.బివి.ప్రసాద్ మాట్లాడుతూ కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు జపాన్ లో ఉన్న తమ ఐటి కంపెనీలో ఉద్యోగాలను కల్పించడం కోసం జపాన్ ప్రతినిధులు తమ వర్శిటీ క్యాంపస్‌కు వచ్చినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఆకర్షణీయమైన జీతంతో పాటు పలు రాయతీలను ఇవ్వడానికి కంపెనీ వారు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కెఎల్‌యులో జపాన్ భాషను నేర్చుకుని విద్యార్థులతో జపాన్ భాషలో ముచ్చటించిన జపాన్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో విసి డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఉద్యోగాల కల్పనల డీన్ డాక్టర్ ఎన్.బివి.ప్రసాద్, ఉద్యోగాల కల్పన సీనియర్ డైరెక్టర్ జె.శరవణబాబు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రామకృష్ణ, అన్ని విబాగాల విబాగాధిపతులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను తక్షణమే నియంత్రించాలి..

విశాలాంధ్ర-తాడికొండ : గ్రామస్తులకు అడ్డంకిగా ఉన్న బెల్ట్ షాపులను తక్షణమే నియంత్రించాలని పొన్నెకల్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు పప్పుల సీతారామిరెడ్డి కోరారు. పొన్నెకల్లు గ్రామ వైసీపీ కార్యాల యంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీతారామిరెడ్డి మాట్లాడారు. గ్రామంలో పదికి పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని ప్రజలు గ్రామ మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. ఎక్సైజ్ పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గ్రామంలో మద్యం షాపు ఉందని స్థానిక ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి నిర్వాహకం వల్ల మద్యం షాపును బండారుపల్లి తరలించడం జరిగిందన్నారు. గ్రామంలో మద్యం షాపు లేకపోవడంతో తాడికొండ, లాం, బండారుపల్లి, రావెల గ్రామాల నుంచి మద్యాన్ని తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఎక్కువగా అడ్డరోడ్డు మద్యం షాపు నుంచి మద్యం గ్రామంలోకి వస్తుందని ఆరోపించారు. ఇక్కడ మద్యం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. బెల్ట్ షాపులలో మద్యం అమ్మేవారిని పట్టుకున్న పోలీసులు ఎక్సైజ్ అధికారులు వారి వద్ద మామూలు దండుకొని వదిలి వేస్తున్నారని విమర్శించారు. లంచాలకు మరిగిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పొన్నెకల్లు వైపు తొంగి చూడటం లేదని అన్నారు. కొందరు యువకులు మద్యం కోసం పక్క గ్రామాలు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన గుర్రం రమేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో రోడ్డు ప్రమాదానికి గురై మరణించడం జరిగిందని గుర్తుచేశారు. మరో ఇద్దరు యువకులు గాయాల పాలై వికలాంగులుగా మారారని తెలిపారు. ఇన్ని జరుగుతున్నా అటు ప్రభుత్వం ఇటు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదని ప్రభుత్వం స్పందించకుంటే జులై 8న పొన్నెకల్లు నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు 100 మందితో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల అండదండలు చూసుకొని అడ్డరోడ్డు మద్యం షాపు నిర్వాహకులు బరితెగించి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని విమర్శించారు. సమయపాలన లేకుండా మద్యం అమ్మకాలు జరుపుతుంటే ఎక్సైజ్ పోలీస్ అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. గ్రామంలో పూర్తిగా బెల్ట్ షాపులను నియంత్రించాలని లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఉప సర్పంచ్ పల్లా విజయలక్ష్మి, వైసీపీ నాయకులు చింతల భాగ్యరావు, కన్నెబోయిన నాగయ్య, గుర్రం హనుమంతరావు, పల్లా సుబ్బయ్య, దిడ్ల విజయ్, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించకుంటే మరో ప్రజా ఉద్యమం

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రక్రియపై ఎనిమిదిన్నర దశాబ్దాలుగా పాలక పార్టీల నిర్లక్ష్యంతో వేలాదిమంది రైతులు కడగండ్ల బారిన పడుతున్నారని ముఖ్యమంత్రి 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర ద్వారా ఇచ్చిన హామీ మేరకు తక్షణం రూ.270 కోట్ల నిధులు విడుదల చేయాలని నల్లమడ రైతు సంఘం, గుంటూరు ఛానల్ పోరాట కమిటీ నాయకులు డాక్టర్ కొల్లా రాజ మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లమడ రైతు సంఘం, గుంటూరు ఛానల్ సాధన కమిటీ నాయకులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా, నిరసన దీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు మాట్లాడుతూ 1936లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం నుంచి నేటి స్వతంత్ర భారతంలో రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు పెదనందిపాడు హై లెవెల్ ఛానల్ నిర్మిస్తామని వాగ్దానం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. 1953 నుంచి పార్లమెంట్ సభ్యులు కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, తరిమెల నాగిరెడ్డి వంటి పార్లమెంటు సభ్యులు, వావిలాల గోపాలకృష్ణయ్య, గౌతు లచ్చన్న, కొరటాల సత్యనారాయణ వంటి అనేకమంది ఉద్దండ శాసనసభ్యులు పెదనందిపాడు హై లెవెల్ ఛానల్ నిర్మించి కృష్ణా జిల్లాలను తరలించమని పార్లమెంటు, శాసనసభల్లో, ప్రజా వేదికలపై పోరాడారని తెలియజేశారు. గుంటూరు ఛానల్ పర్చూరు దాకా పొడిగించడం ద్వారా పెదనందిపాడు, పర్చూరు, ప్రత్తిపాడు, కాకుమాను, మండలాల వేలాది మంది రైతులకు ప్రయోజనకరంగా మారుతుందని పలు మార్లు వినతిపత్రాలు, ఉద్యమాలు చేసినా కానీ పాలక పార్టీల నాయకులకు పట్టకపోవడం దారుణమని అన్నారు. 2019లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అప్పటి హోం మంత్రి ప్రస్తుత శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చకపోవటం దుర్మార్గమని అన్నారు. ఛానల్ పొడిగింపు సందర్భంగా భూముల కొనుగోలుకు రూ.120 కోట్లు, ఛానల్ నిర్మాణానికి రూ.150 కోట్లు తక్షణం విడుదల చేయాలని, లేకుంటే మరో ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటూరు ఛానల్ సాధన కమిటీ నాయకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, జాస్తి వీరయ్య చౌదరి, రామినేని సురేష్, బండి నాగేశ్వర రావు, కొల్లా చిట్టెమ్మ, గొల్లపూడి శారద, జాస్తి వీరయ్య చౌదరి, లావు అంకమ్మ చౌదరి, గద్దె రామయ్య, మన్నవ హరిప్రసాద్, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

తూర్పు నియోజకవర్గంలో ఎంపీ పర్యటన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తూర్పు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు నిమిత్తం బీఆర్ స్టేడియాన్ని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, తూర్పు నియోజకవర్గ వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమాతో కలిసి సందర్శించారు. స్టేడియంలో నెలకొన్న సమస్యలను అక్కడి వాకర్స్ అసోసియేషన్ వారిని అడిగి తెలుసుకున్నారు. నందివెలుగు రోడ్డులో పర్యటించారు. నందివెలుగు రోడ్డుకు సంబందించిన సమస్యల పరిష్కారానికి జీఎంసీ అధికారులతో చర్చించి త్వరితగతినే సమస్యలకు పరిష్కారాలు చేయాలని ఆదేశించారు. కాకుమానువారితోటలోని వెల్ఫేర్ సెంటర్ నందు ఉన్న కార్మికశాఖకు సంబందించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. ఇక్కడ హాస్పిటల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రాబోవు కాలంలో ఏ సమస్య తలెత్తకుండా మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్. షజిల, ఈఈ కోటేశ్వరావు, ఏఈలు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, స్థానిక వైసీపీ వార్డ్ ప్రెసిడెంట్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు జయంతి

విశాలాంధ్ర-మంగళగిరి : భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు 102వ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నరసింహారావు జయంతి వేడుకలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. షేక్ సలీమ్ పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచిపెట్టారు. షేక్ సలీం మాట్లాడుతూ పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచిన నేతగా కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి తీసుకురావలసిన అవసరత ఉందని, 2024 ఎన్నికలలో మోడిని గద్దెదించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయుటకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పాకుల కృష్ణారావు చౌదరి, రేమణిశెట్టి హనుమంతరావు, బొడ్డు శివరామారావు, కురగంటి చిన్న రత్తయ్య, గోలి సాంబశివరావు, దేశబోయిన మోహనరావు, గుడిపాటి అర్జునరావు, దేవినేని శ్రీరామమూర్తి, దామర్ల వీరప్రసాద్, దర్శనపు శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు, పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

విశాలాంధ్ర-మేడికొండూరు : పేరేచర్ల కూడలిలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టుతో పాటు, జోసిల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధు నిక సీసీ కెమెరాలను బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనేక ప్రాంతాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉండే పేరేచర్ల కూడలిలో రోడ్డు ప్రమాదాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాలు జరిగినప్పుడు త్వరితగతిన నేరస్తుల్ని పట్టుకోవడంలో పోలీసు వారికి ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ అత్యాధునిక కెమెరాలలో ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ టెక్నాలజీతో రాత్రి సమయాల్లో సైతం వాహనాల నంబర్లను గుర్తించవచ్చన్నారు. ఈ కెమెరాలను పేరేచర్లలోని జోసిల్ కంపెనీ యాజమాన్యం రూ.5లక్షల 20వేలుతో ఏర్పాటు చేసిందని, దీనికి జోసిల్ కంపెనీ యాజమాన్యానికి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ అనంతరం మేడికొండూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రాత్రి గస్తీలు విస్తృతంగా ఏర్పాటు చేసి నేరాలను అదుపు చేస్తామని ఎస్పీ తెలిపారు. పేరేచర్లలో తిరుగుతూ నిబంధనలు పాటించని క్రషర్ల లారీలపై మైనింగ్ శాఖ సమన్వయంతో కేసులు రిజిస్టర్ చేస్తామని ఎస్పీ తెలిపారు.

సంపద సృష్టించి పథకాల అమలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో వైసీపీకి వణుకు పుట్టిందని అందుకే సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారని, సంపద సృష్టించి సంక్షేమ పథకాల అమలు చేయగల సత్తా టీడీపీకి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో భవిష్యత్తుకి గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మన ఇంటికి మన నాని కార్యక్రమాన్ని నియోజకవర్గం పరిశీలకులు సింహాద్రి కనకచారితో కలిసి కోవెలమూడి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా 19వ డివిజన్ నల్లచెరువు 1వ లైన్ నుండి కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటి ఇంటికి తిరిగి టీడీపీ ప్రకటించిన మ్యానిఫెస్టోని ప్రజలకు అందించి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే జరిగే మేలు గురించి వారికి తెలియచేసారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దోచుకున్న అక్రమ ఆస్తులను వెనక్కి తెచ్చి, ప్రభుత్వ నిధుల దుబారాని అరికట్టి, సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తామని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా మహిళలు, యువత, రైతులు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని మినీ మేనిఫెస్టోలో హామీలు ఇచ్చామని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు కనకచారి మాట్లాడుతూ మేనిఫెస్టో ఇంటింటికి ప్రచారం చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముత్తినేని రాజేష్, రాళ్లబండి రామరాజు, పరిమి రమేష్, అబ్దుల్ రహీం, రమణమ్మ, విజయలక్ష్మి, రఫీ, రబ్బానీ, సుఖవాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MOHAMMED ZIELANI BASHA** (Old Name) S/o. Abdul Subhani Mohammed, R/o. D.No.14-4-61, Potturivari Thota, Kothapeta, Guntur - 522001, Guntur District, Andhra Pradesh, have changed my name to **MOHAMMED JILANI BASHA.** Hereafter my name is known as **MOHAMMED JILANI BASHA.**

డాక్యుమెంట్ పోయినది

ఖాళీ స్థలము విక్రయ దస్తావేజు నెంబర్ **2903/2019**, ది. **25-03-2019**న నా పేరున గుంటూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన దస్తావేజు **20-05-2023**న లాంచెస్టర్ రోడ్డు సంగడిగుంటలో జిరాక్స్ కొరకు వెళ్ళగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల **ఎనికేపల్లి గంగాధర రావు, S/o. వీరరాఘవులు,** డోర్ నెం.19-7-470, 3వ లైను, నంగడిగుంట-3 అడ్రస్‌లో అందజేయగలరు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

క్విజ్‌లో వేల్పూరు విద్యార్థులకు తృతీయ స్థానం

విశాలాంధ్ర-శావల్యాపురం: భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను శంకర భారతీపురం జడ్పీ పాఠశాలలో నరసరావుపేట యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్-2023 పోటీలలో వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పొత్తూరి సాయిసుభాష్, జ్యోతి స్వామి వివేకానందలు తృతీయ స్థానాన్ని సాధించారు. తృతీయ స్థానం సంపాదించిన విద్యార్థులకు శంకర భారతీపురం హెచ్ఎం పార్వతి, మేనేజర్ కమలాకర్ చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రాలు అందజేసి వారిని అభినందించారు. విద్యార్థులను వేల్పూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మహబూబ్ సుభాని, విద్యాకమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల జ్యోతి శ్రీనివాస రావు, మరియదాసు, శివరామకృష్ణ, రత్నలత, హరీష, గ్రామస్తులు అభినందించారు.

టైఫాయిడ్ టీకా శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-శావల్యాపురం: దాతల సహకారంతో మండలంలోని వేల్పూరు హరిజన కాలనీలోని ఎంపిపి పాఠశాలలో బుదవారం నిర్వహించిన ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరానికి ప్రజల నుంచి విశిష్టమైన స్పందన లభించినట్లు వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. వేల్పూరు గ్రామానికి చెందిన బోయపాటి త్రివిక్రమ్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 2-15ఏళ్ళలోపు వయసున్న 70 మంది చిన్నారులకు ఉచితంగా టైఫాయిడ్ నిరోధక టీకాలను పంపిణీ చేశారు. చలపతిరావు మాట్లాడుతూ ఒక డోసు టైఫాయిడ్ టీకాతో మూడేళ్ల పాటు టైఫాయిడ్ జ్వరాలు రాకుండా నివారించవచ్చని, 40ఏళ్ళలోపు వయసున్న వారంతా టైఫాయిడ్ టీకాను వేయించుకోవచ్చన్నారు. దాత బోయపాటి త్రివి క్రమ్, ఎస్పి రామపరమేశ్వరరావు, దన్నవరపు శ్రీనివాసరావు, రవిచంద్ర, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మత్యకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయపురిసౌత్: స్థానిక డౌన్ మార్కెట్‌లో ఇటీవల మత్యకారుడు చోడిపల్లి దుర్గయ్య (65) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం విజయపురిసౌత్ కనకదుర్గా ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కారే ముసలయ్య ఆధ్వర్యంలో మృతుని భార్య లక్ష్మమ్మకు 5 వేల రూపాయల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ తరపున అందచేశారు. మృతుడి కుటుంబానికి సొసైటీ తరపున అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు యజ్జల శ్రీను, ఆనంద్, పూరి పాల్గొన్నారు.

పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో 7.8.9 తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె నయోమి బుధవారం చెలిపారు. జులై 2వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని 4వ తేదిన పాఠశాలలో ప్రవేశపరీక్ష ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రవేశపరీక్ష ద్వార సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఆశక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాల నందు జువాలజి, బోటని తరగతులు బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలని వారు ఎంఎస్సీ బిఈడి చదివిన వారు అర్హులన్నారు. జులై 1వ తేదిన కళాశాల నందు జరిగే ఇంటర్వ్యూకు హాజరు అవ్వాలని వారు తెలిపారు.

బస్సు యాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గ పరిధిలోని క్రోసూరులో ఈ నెల 30వ తేదీన తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లి జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలు, భారాలు, నిత్యవసర సరుకులు ధరలు, విద్యుత్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు ఇతర అంశాలపై తెలియజేయడం జరుగుతుందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో 99 శాతం హామీలు అమలు చేశామని చెప్పుకోవడం దురదృష్టకరమని శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేశం పార్టీ అధ్యక్షులు అచ్చెన్నయుడు, పల్నాడు అధ్యక్షులు జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. నియోజావర్గం నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తిమల్ల రమేష్, బెల్లంకొండ రాంగోపాలరావు, భాష, ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, వెల్లలచెరువు సురేష్, వేము వెంకటప్పయ్య, గుడిపూడి రాజు, షేక్ కరిముల్లా, పాటిబండ్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ జయంతి

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక లాయర్ స్ట్రీట్ లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో వినుకొండ నియోజకవర్గ బ్రాహ్మణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి ఘనంగా జరిగినది. బ్రాహ్మణ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ మంత్రిరాజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పీవీ నరసింహారావు భరత జాతి ఆణిముత్యమని తెలుపుతూ, వారి యొక్క సేవలను ఎంతో ప్రశంసించారు . వారు భారతదేశానికి చేసినటువంటి ఆర్థిక సంస్కరణలను కొనియాడటం జరిగినది. ప్రముఖ బ్రాహ్మణ పెద్దలందరూ స్వర్గీయ ప్రధాని పీవీ నరసింహారావు నివాళులు అర్పించడం జరిగినది.ఈ కార్యక్రమం లో బ్రాహ్మణ ప్రముఖులు తెలికేపల్లి వెంకటేశ్వర్లు, పి.వి. సురేష్ బాబు , మారెపల్లి నరసింహ మూర్తి, భాగవతుల రవికుమార్, , భాగవతం జనార్ధన చార్యులు,ప్రముఖ చిత్రకారులు బొడ్డుచర్ల ప్రసాదరావు, గుంటుపల్లి చంద్రశేఖర్, చింతలచెరువు రఘు, గోపాలుని టాగోర్ , యడవల్లి శ్రీనివాస శర్మ,శ్రీమతి శ్రీవల్లి పావని, శ్రీమతి వేలమూరి నాగమణి, శ్రీమతి శారదా, మతుకుమల్లి టాగోర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడిని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో పేరుమీన శీతారామయ్య అన్నారు. అమ్మవడి నాల్గవ విడుత నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుదవారం ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిదిలో 3021 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం వర్తించగా అందులో 27వ తారీకు వరకు 2933 తల్లుల చేత ఈకేవైసి పూర్తి చేయడం జరిగిందని, ఈకేవైసి పూర్తి అయిన తల్లుల ఖాతాలో నేటి నుండి నగదు జమ చేయడం జరుగుతుందని, మిగిలిన వారి ఈకేవైసి జూన్ 30వ తారీకు వరకు తీసుకుంటామని, విరికి జూలై మొదటి వారంలో జమ అవుతాయని తెలిపారు.

బ్రహ్మారెడ్డి నిరాధార అరోపణలు మానుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల: పేద ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం పాటుపడుతున్న తనపై టీడీపీ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రలో ఆ పార్టీ నాయకులు పత్తిపాటి పుల్లారావు, ఎరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే పీఆర్కే తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో పల్నాడు ప్రాంతంలో జరిగిన అభివృద్ధి టీడీపీ నాయకులకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. మోసపూరిత హామీలతో 14 ఏళ్ళు అధికారంలో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు పల్నాడు ప్రాంతానికి చేసిన మంచి ఏమిటో సమాధానం చెప్పాలన్నారు. దశాబ్దలకాలంగా గత ప్రభుత్వాలు సాధించలేని వరికపాడిసెల ప్రాజెక్టును సీఎం జగన్ సాధించి తీరారన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు సాధ్యం కాదని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాడు అసెంబ్లీ సాక్షిగా చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. తాను అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్నానంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పలనాడులో జూలకంటి బ్రహ్మారెడ్డి వచ్చి చిచ్చులు పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నాయకులు వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

బాలల హక్కులపై అవగాహన

విశాలాంధ్ర-అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోని గుడ్ షెఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు పాలకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ విన్నరస్సి మాట్లాడుతూ మానవ హక్కుల బాలల హక్కులని అంటే పెద్దవారికి ఉన్న హక్కులు అన్ని బాలల కూడా రాజ్యాంగబద్ధంగా వర్తిస్తాయి. బాలలకు ప్రత్యేకంగా 1989లో ఐక్యరాజ్యసమితి హక్కులను ఇవ్వడం జరిగింది. ఈ హక్కులను కాపాడటం మన అందరి బాధ్యత అని తెలియపరిచారు. చైల్డ్ లైన్ టీమ్ మెంబర్ బి బాబు మాట్లాడుతూ బాలల హక్కుల పడంబడిక నాలుగు ప్రాథమిక సూత్రాలతో చేయబడినది. అది జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందేకు, భాగస్వామ్యకు హక్కు. పుట్టిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా పౌష్టికాహారంతో మంచి వాతావరణం త్రాగునీరు సదుపాయం గవర్నమెంట్ వారు కల్పించాలని, బాలలపై లైంగిక దాడులు వేధింపులు, శారీరక మానసిక హింస జరిగిన వెంటనే రిపోర్ట్ చేయాలని తెలియజేశారు. మంచి విద్యాబుద్ధులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై పిల్లలకు మంచి ప్రోత్సాహం తల్లిదండ్రులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ లక్ష్మణ్, పవన్ మహిళలు పాల్గొన్నారు.

కానాల పున్నారెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలోని నూజండ్ల మండలం గురపనాయుడుపాలెం సోసైటీ ఇన్ చార్జ్ చైర్మన్‌గా నియమితులైన పాత చేరుకుంపాలెం గ్రామంకు చెందిన కానాల పున్నారెడ్డిని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు సన్మానించారు. వారితో పాటు నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండపైకి బస్సుల ట్రైల్ రన్

విశాలాంధ్ర-వినుకొండ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం జరగబోయే తిరుణాలకు భక్తులు కొండపైకి వెళ్ళుటకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసే క్రమంలో భాగంగా కొండపైకి బస్సును ట్రైల్ రన్ నిర్వహించారు. శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాజీ శాసనసభ్యులు మల్లికార్జున రావు ఆర్టీసీ మేనేజర్ కోటేశ్వర నాయక్ కొండ దిగువ నుండి కొండపైకి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. కొండ దిగున ఆర్టీసీ బస్సులు నిలుపుకోవడానికి కావలసిన స్థలాన్ని పరిశీలించి అనంతరం కొండమీద బస్సులు నిలుపుకునే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సిటీ స్ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఫేస్ 1 క్రింద సుమారు రూ.8 కోట్లు విడుదల కావటంతో ప్రైమరీ స్కూల్స్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి బుధవారం సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి జేసీబీలతో జంగిల్ క్లియరెన్స్ పనులను మొదలుపెట్టారు. సిటీ స్ ప్రాజెక్ట్ పనులు మంగళగిరి నియోజకవర్గంలో 6 చోట్ల ప్రారంభించారు. బేతపూడి గ్రామంలో ప్రైమరీ స్కూల్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.2.70 కోట్ల నిధులతో నిర్మించడానికి, కృష్ణయ్యపాలెంలో ప్రైమరీ స్కూల్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి సుమారు రూ.2.90 కోట్ల నిధులతో నిర్మించడానికి, నవులూరు గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి సుమారు రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించడానికి, కురగల్లు గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి సుమారు రూ.1.02 కోట్ల నిధులతో నిర్మించడానికి పనులను ప్రారంభించారు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరంలోని తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా అంటున్నారని, నగర మేయర్ తూర్పు అభివృద్ధికి రూ.217 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందని చెబుతున్నారని, అసలేమి జరిగిందో తెలుసుకోవడానికి ఈ వ్యవహారంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ డిమాండ్ చేశారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉస్మాన్ మాట్లాడుతూ తూర్పు అభివృద్ధికి ఖర్చు పెట్టిన ఆ రూ.217 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. తక్షణమే నియోజకవర్గ అభివృద్ధి సంబంధించిన ఆధారాలు బయటపెట్టాలని, లేనిపక్షంలో కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జాని గోల్డ్, సయ్యద్ సుభాని, రహంతుల్లా, మోషే తదితరులు పాల్గొన్నారు.

లేమల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-అమరావతి: మండలంలోని లేమల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు ఉత్సాహంగా సాగింది. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా.. వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయి.. అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లబ్ది, సంక్షేమ ఫలాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. లేమల్లెలో జరిగిన అభివృద్ధి, శాశ్వత వనరుల కల్పన, నిధుల వినియోగం వివరాలు ప్రజలకు తెలియజేశారు. లేమల్లెలో నాలుగేళ్లలో సంక్షేమం, అభివృద్ధికి రూ.12 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఇదే అభిమానాన్ని చూపించి సీఎం జగన్ మోహన్ రెడ్డి, తనకు ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు.

నారా ఫౌండేషన్ భారీ వితరణ

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని వంకాయలపాడు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆరు తోపుడు బళ్ళు, రూ.4లక్షల, 64వేలు నగదును పంపిణీ చేశారు. ఆరుగురు చిరు వ్యాపారులకు 6 బండ్లు, 116 మంది తెదేపా కార్యకర్తలకు రూ.4వేలు చొప్పున నగదును అందచేశారు. కార్యక్రమంలో నారా ఫౌండేషన్ సభ్యులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఆదం, షేక్ సలాం, చిన్నకర్ణి సామేలు, షేక్ నాగుల్ మీరా, పఠాన్ ఖాన్, బండారు వేణు, షేక్ జాను, షేక్ దాదావలి, షేక్ చిన్న అల్లాబక్షు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు ఉప సర్పంచ్ గోనుగుంట్ల హరిబాబు, యడ్లపాడు గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షులు పారా హరిబాబు, పోపూరి రాఘవయ్య, గోనుగుంట్ల జయలక్ష్మీ, పావులూరి శ్రీనివాసరావు, కుర్రా అప్పారావు, నాయకులు రాములు, కల్లూరి రాములు, నాగభైరు శ్రీరామ్మూర్తి, గల్లా లక్ష్మీ నారాయణ, కుర్రా వేణు, కుర్రా శివ, కాకుమాను శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీనివాసరావు, శ్రీధర్, పుల్లగూర సునీల్, పుల్లగూర సునీల్, శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు పాలాభిషేకం

విశాలాంధ్ర-యడ్లపాడు : జగనన్న అమ్మవాడి డబ్బులు పడిన సంతోషంలో యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్ర పటానికి వైస్సార్ పార్టీ అభిమానులు, దాదాపు150 మంది పిల్లలు పాలాభిషేకం చేశారు. ప్రతి పేదవాడిని గొప్పగా చదివించాలనే సంకల్పంతో సీఎం జగనన్న ఇంట్లో పిల్లలు మాదిరిగా ప్రతి పిల్లవాణ్ణి గొప్ప స్థాయిలో ఉంచే ఉద్దేశంతో గత మూడు సంవత్సరాలు లాగానే నాలుగవ సంవత్సరం కూడా విద్యార్థుల తల్లి అకౌంట్లో అమ్మఒడి డబ్బులు వేసిన సందర్భంగా బోయపాలెం గ్రామంలో దాదాపుగా 150 మంది పిల్లల కోలాహలం మధ్య జగన్ మావయ్య అంటూ ఫోటోకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బోయపాలెం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ వి. శ్రీనివాస్ నాయక్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ మొహిద్దిన్ భాష, ఆర్ శివ నాయక్, వి.శేఖర్ నాయక్, సీనియర్ నాయకులు షేక్ చిన్న మస్తాన్, షేక్ పెదరాజులు, షేక్ ముస్తఫా, మరిపాలెం గ్రామ అధ్యక్షుడు వలేటి ఉదయ్ కిరణ్, షేక్ జాను, బోడ సురేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : గ్రామాలలో లెప్రసీ సర్వే కోసం వచ్చే ఆరోగ్య సిబ్బందికి ప్రజలందరూ కచ్చితమైన సమాచారం అందించి సహకరించాలని వైద్యాధికారి డాక్టర్ వేమూరి వెంకట భాస్కర్ అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో జరుగుతున్న ఎల్సీడీసీ సర్వేను ఆయన బుదవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సర్వే చేయడం ద్వారా అనుమానితులకు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. చర్మంపై ఉన్న మచ్చల ఆధారంగా చికిత్సలు ప్రారంభిస్తారని, రాగి రంగు, స్పర్శలేని మాచ్చలు ఉంటే వాళ్ళను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ దగ్గరకు పంపిస్తారని, డాక్టరు వారికి పరీక్ష చేసి కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే 6 నెలల నుండి 12 నెలల పాటు రెండు రకాల మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఇది అంటువ్యాధి కాదని, మందులు వాడితే నయమవుతుందన్నారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేసి జులై 16 నాటికి నూరు శాతం సర్వే పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ఆయన వెంట సూపర్వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, సాయిగీత, ఎఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తాడికొండ మండలం, కంతేరు గ్రామ దళితులపై దాడి చేసిన వారిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న కంతేరు గ్రామంలో దళిత యువకులను మాట్లాడుకుందామని పిలిచి దాడి చేసిన ఆధిపత్య కు యువకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ యువకులకు వత్తాసు పలికి తప్పుడు కేసులను బనాయించిన తాడికొండ పోలీసులపై చర్యలు తీసుకుని తక్షణమే సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గాయపడిన దళిత యువకులు జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటున్న వారిని భయపెట్టి వెనక్కి పంపిన డాక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె విద్యాసాగర్, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, జొన్నలగడ్డ శ్రీకాంత్, కనకపల్లి వినయ్, స్టాలిన్, జోసఫ్, గోపీ తదితరులు ఉన్నారు.

ట్రై సైకిల్ వితరణ

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి పట్టణం, రెండవ వార్డు పరిధి, కొత్తపేటలో బిట్ర రత్తయ్య పూర్తిగా రెండు కాళ్ళు లేని తనకి ట్రై సైకిల్ అందజేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి అర్జీ రూపంలో విన్నవించుకున్నారు. బిట్ర రత్తయ్య కు లోకేష్ టీడీపీ నాయకులచే ట్రై సైకిల్ అందజేయించారు. పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర ఉన్నారు. అలాగే మంగళగిరి 17వ వార్డుకు చెందిన కొత్తపల్లి సాంబయ్య భార్గవపేటలో ఇస్త్రీ చేసుకుంటూ సొంత బండి లేక ఇబ్బంది పడుతున్న తనకు ఇస్త్రీబండిని అందజేయవలసిందిగా నారా లోకేష్‌కి అర్జీ రూపంలో విన్నవించుకున్నారు. టిడిపి నాయకులచే బుధవారం ఇస్త్రీ బండిని అందజేయించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

విశాలాంధ్ర-కారంపూడి: మాచర్ల నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండే విధంగా బూత్‌లెవల్ అధికారులు విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం నందు కారంపూడి, దుర్గి మండలాల బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ఓటు ప్రజల ప్రాథమిక హక్కు అన్నారు. మీకు కేటాయించిన బూతు పరిధిలో ఏ కారణం చేతనైనా ఓటును తొలగించవలసివస్తే విచారణ అనంతరం సంబంధిత కుటుంభికులకు నోటీసు యిచ్చిన పిదప మాత్రమే ఓటును తొలగించాలన్నారు. ఇంటర్మీడియెట్ కళాశాలలో డ్రైవ్ నిర్వహించి 1 జనవరి 2024 తేది వరకు 18 సంవత్సరాలు నిండే వారిని గుర్తించి వారితో ఓటు కొరకు దరఖాస్తు చేయించాలన్నారు. ఎన్నికల విధులలో అలసత్వం వహించే వారి పట్ల ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకునేందుకు వెనకాడబోదని హెచ్చరించారు. కారంపూడిలో ఒకే ఇంటి నెంబరులో 46 మంది ఓటర్లు ఉన్నారని ఆవిధంగా ఓటర్ల లిస్టు తప్పులతడకగా ఉందని, అటువంటి వాటిని గుర్తించి తొలగించాలని ఆయన సూచించారు. ఇంటి నెంబరు జిరో ఉన్న ఓటు కార్డులను గుర్తించి నోషనల్ నంబర్లు ఇవ్వాలన్నారు. గ్రామ జనాభా ఆధారంగా సుమారు 75 శాతం ఓటర్లు ఉండాలని అంతకుమించి ఎక్కువ శాతం ఓటర్లు ఉన్నట్లయితే ఆ గ్రామ ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నట్లు గా భావించాలని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో చెంచులు అధికంగా ఉన్నారని, అందులో దుర్గి మండలం 645 మంది ఉన్నారని వారికి ఓటు హక్కు కల్పించవలసిన బాధ్యత బూత్ లెవల్ అధికారులదేనన్నారు. ట్రాన్స్‌జండర్స్ నియోజకవర్గంలో 26 మంది ఉండగా కారంపూడిలో 6గురు, దుర్గిలో 8 మంది ఉన్నారని, నిరాశ్రయులను గుర్తించి వారందరికి ఓటు విలువ తెలియచేసి వారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కైన ఓటును అందించాలన్నారు. కారంపూడి, దుర్గి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ప్రతి మూడు రొజులకొకసారి దరఖాస్తుల పురోగతి తెలియచేయాలన్నారు. ఈ సమావేశంలో కారంపూడి తహశీల్దార్ జి శ్రీనివాస్, దుర్గి తహశీల్దార్ రమేష్, డిప్యూటి తహశీల్దార్ కీర్తిసుధాస్రవంతి, భాషా, రెండు మండలాల బూతులెవల్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ తరహాలో సాగు సాయం ఇవ్వాలి

విశాలాంధ్ర-వినుకొండ: తెలంగాణ తరహాలో ప్రతి ఎకరాకు పదివేల రూపాయలు సాగు సాయం మన ప్రభుత్వం ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణభారంతో ఉన్నారు. దేశంలో ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతు లే కారణం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటించిన మద్దతు ధరలు, ఆ శాస్త్రీయంగా ఉన్నాయి. కనీస మద్దతు ధరల కు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారు. డాక్టర్ సోమనాథ్ కమిషనర్ సిఫార్సులను ప్రభుత్వాలు అటకెక్కించాయి, వీటన్నిటిపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బుధవారం రాష్ట్రం పిలుపులో భాగంగా పల్నాడు జిల్లాలో విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిన్నేబోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, కొండలు,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సాఆర్ జలకళ రైతులకు వరం

విశాలాంధ్ర-వెల్దుర్తి: మండల పరిధిలోని కండ్లకుంట గ్రామంలో వైయస్సార్ జలకళలో భాగంగా బుధవారం వైసీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన వెల్దుర్తి మండలం వైయస్సార్ జలకళ రైతులకు ఎంతో చేయూతనిచ్చిందని అన్నారు. పేద రైతులకు బోరు బావులను తవ్వించడం వలన ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, ఈడ బోయిన వెంకయ్య, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మార్తాల ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యాక్టివ్ ప్యానల్స్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందింపజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. శావల్యాపురం, వేల్పూరు జడ్పీ పాఠశాలలలో నూతనంగా డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు ప్రభుత్వం ఇంటర్ యాక్టివ్ ప్యాట్ ప్యానల్స్‌ని త్వరలో అందజేయనున్న నేపథ్యంలో వాటిని అమర్చేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఎంఈవో బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 6-10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు శావల్యాపురానికి 8, వేల్పూరుకు 4 ప్యానల్లను ప్రభుత్వం అందజేయనుందని, వాటిని అమర్చేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. 1-5 తరగతుల విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన నిర్వహించేందుకు శావల్యాపురం జడ్పీ పాఠశాలకు రెండు, కారుమంచి, మతుకుమల్లి, కనమర్లపూడి, శావల్యాపురం ప్రాథమిక పాఠశాలలకు ఒకటి చొప్పున స్మార్ట్ టీవీలను ప్రభుత్వం త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వేల్పూరు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎంలు బొడ్డపాటి విజయలక్ష్మి, మహబూబ్ సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-వినుకొండ: ఈనెల 29వ తేదీ గురువారం తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ కొండపై జరిగే శ్రీ రామలింగేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు ఘాట్ రోడ్డు మీదగా కొండపైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు అన్ని శాఖల వారు తమ తమ విధులను నిర్వహిస్తున్నారు. కొండపైన. కింద వైద్య ఆరోగ్యశాఖ వారు శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్యం అందుబాటులో ఉంచారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు బుధవారం ఉదయం నుండి ఘాట్ రోడ్డు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు బస్సులు . ఘాట్ రోడ్డు మీదగా బస్సులు కొండపైకి వెళుతున్న కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోడ్డు పనులను ఎమ్మెల్యే దగ్గర ఉండి పర్యవేక్షించారు. స్వచ్ఛంద సంస్థలు కొండపైన లక్ష మందికి పైగా భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. అలాగే హిమాలయ గురూజీ గురువారం సాయంత్రం అఖండ జ్యోతి వెలిగించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు భక్తులు అఖండ జ్యోతిని తిలకించేందుకు అన్ని వసతులు కల్పించారు.

ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తే ఊరుకోం..

విశాలాంధ్ర-పొన్నూరు : హత్య రాజకీయాలు చీకటి వ్యాపారాలకు మారుపేరుగా ఉన్న టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నాయకులపై దుష్ప్రచారానికి తెరతీశారని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు దుయ్యబట్టారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ యార్డ్‌లో ఉద్యోగి అయిన షేక్ హుస్సేన్ బాషు ఉద్యోగ నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని హత్యగా చిత్రీకరించి పచ్చ మీడియా ద్వారా రాద్ధాంతం చేసి స్థానిక ఎమ్మెల్యేను వైసీపీ నాయకులకు దాన్ని అంటగట్టి టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అవినాష్ ఇచ్చిన రిపోర్టును బహిర్గతం చేసి చూయించి, అసలు ఎఫ్ఐఆర్‌లో ఏముందో టీడీపీ నాయకులు సరిగ్గా తెలుసుకోవాలని హితవుపలికారు. లేని విషయాలను కూడా ఉన్నట్లుగా చూపి వైసీపీ నాయకులపై బురద జల్లడం ద్వారా లబ్ధి పొందేందుకు వారు చేస్తున్న విఫల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మాని ప్రజల మన్ననలు పొందేందుకు ఏదైనా మంచి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరికల కృష్ణమోహన్, దాసరి నారాయణ, మల్లెల రాజు, అధిశేషు, యాందేటి వెంకట సుబ్బయ్య, దేవరకొండ గోపి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో తాడేపల్లి టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో డోలాస్ నగర్ ఎంఎస్‌కే టీం, తాడేపల్లి మారుతి టీంకి చెందిన క్రీడాకారులకు రెండు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజ్జం రామకృష్ణారావు, పట్టణ మాజీ అధ్యక్షులు ఇట్టా పెంచలయ్య, మంగళగిరి నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్, నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు తురకా సరేష్, తాడేపల్లి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గుద్దంటి నాగేశ్వరరావు, చింతపల్లి లక్ష్మయ్య, 7వ వార్డు అధ్యక్షులు కుందుర్తి కోటేశ్వరరావు, నియోజకవర్గం క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షులు అక్కల చెన్నయ్య, మట్టిపల్లి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆత్మరక్షణ ముఖ్యం

విశాలాంధ్ర, తెనాలి : భాష్యం స్కూల్లో 5వ తరగతి చదువుతున్న కె.లారా సౌందర్య విజయనగరంలో జరిగిన మూడవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండ్ సబ్ జూనియర్, క్యాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి హృదయరాజ్, ప్రధానోపాధ్యాయులు పి.రాము అభినందించారు. విద్యతోపాటు ఆత్మరక్షణ కూడా ముఖ్యమని వారన్నారు.

వామపక్ష పార్టీలతో ఐక్య ఉద్యమాలు

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలతో కలిసి పోరాడేందుకు జై భీమ్ భారత్ పార్టీ సంసిద్ధంగా ఉందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ జై భీమ్ భారత్ పార్టీ చేపడుతున్న గడపగడపకు దగా ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి చిక్కాల మణిలాల్, సీపీఐ జిల్లా నాయకులు పి.నాగాంజనేయులును కలిసి గడపగడపకు దగా ప్రభుత్వం కరపత్రాలు అందించినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల ప్రతినిధులు మేధావి వర్గం కలిసి పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు పార్టీ అధినేత జడా శ్రావణ్ కుమార్ చేపడుతున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాల గురించి ప్రతి ఒక్కరికి వివరిస్తామని చెప్పారు. 2024 ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో జై భీమ్ భారత్ పార్టీని సముచిత స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీ పెనుమాల సుబ్బారావు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, నెరసు వెంకటరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మరణించిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సహచర ఫొటోగ్రాఫర్లు ఆర్థిక సహకారం అందించారు. చీరాల నియోజకవర్గంలోని సుబ్బయ్యపాలెంకు చెందిన పి.అంజయ్య ఈనెల 20న అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. చీరాల క్షీరపురి ఛాయాచిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లు ఆయన ఇంటికి వెళ్లి అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అంజయ్య కుమారుడు నాగబాబుకు అసోసియేషన్ తరపున రూ. 21వేల నగదును అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయం అవసరమైనా సహకరిస్తామని ప్రతినిధులు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో చీరాల క్షీరపురి ఛాయాచిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లిఖార్జున, ఆషిద్, మస్తాన్ వలి, అందె ప్రసాద్, కిషోర్, నేతాజీ, పోతురాజు, రంగనాథ్, అరవింద్, శేషు, చింతం కోటివీరయ్య, రాజు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గంలోని వినాయకపురానికి చెందిన పేద ముస్లిం మైనారిటీ మహిళ షేక్ కరిమూన్ గత మూడు సంవత్సరాలుగా తన స్వంత గృహ నిర్మాణం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. అధికారులకు అర్జీలు పెట్టుకున్నా ఉపయోగం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న జిల్లా బీజేపీ అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు తనవంతుగా ఐదు వేల రూపాయలు అందించారు. మండలంలోని దేవాంగపురి పంచాయతీ నివాసి బట్ట రవివర్మ ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. శ్రీ వివేకానంద ట్రస్ట్ కార్యదర్శి నాసిక శివాజి కొంత మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా కరీమూన్ తమ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి మాజీ సర్పంచ్ మృతి

విశాలాంధ్ర-అద్దంకి : ట్రాక్టర్ కిందపడి తిమ్మాయపాలెం మాజీ సర్పంచ్ తోకల వెంకటేశ్వర్లు (73)మృతి చెందిన సంఘటన తిమ్మాయపాలెం పొలాల్లో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ తోకల వెంకటేశ్వర్లు మంగళవారం మధ్యాహ్నం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా గోతిలో ట్రాక్టర్ బోల్తాపడటంతో వెంకటేశ్వర్లు తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడు రెండేళ్ల క్రితం ఇదే విధంగా ట్రాక్టర్ మీదపడి మృతి చెందాడు. కుమారుని మృతి వార్త తట్టుకోలేక తోకల వెంకటేశ్వర్లు భార్య కూడా గుండె పోటుతో అప్పుడే మృతి చెందింది. ఆయన మృతదేహానికి బుధవారం శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : డిసెంబర్ నాటికి జగనన్న లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు.వేలమూరిపాడు లేఅవుట్ నందు ఆప్షన్ -3 కింద లబ్దిదారులకు కాంట్రాక్టర్‌చే గృహ నిర్మాణాలకు బుధవారం కృష్ణచైతన్య భూమిపూజ నిర్వహించారు. మొత్తం 520 ఇళ్ళను కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో గృహాలు నిర్మించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఏఇ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, కమీషనర్ శ్రీనివాసులు,మండల స్పెషల్ ఆఫీసర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల ద్వారా నిర్వహించాలని ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి మస్తాన్ రావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. గ్రామ సర్పంచుల సహకారం అధికారుల పర్యవేక్షణ ప్రజల భాగస్వామ్యంతో 12 ఉచిత సేవలను చివరి వరకు అందని పథకాలను అందించే విధంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పంతో అర్హత ఉన్న ప్రతి పేదవారికి పథకాలను అందించే విధంగా సిద్ధం అవ్వాలని, ఇందుకుగాను ఎమ్మార్వో, ఎంపీడీవో రెండు టీములుగా అధికారులతో ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు చేరువు చేసే లాగా ఉండాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు తెలిపారు. ఎమ్మార్వో బి. సుశీల మాట్లాడుతూ భూ సమస్యలు, రేషన్ కార్డులలో సవరణలు గ్రామ సచివాలయంలో చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నాదెండ్ల దశరధరామయ్య, ఈపూరి విజయకుమార్, బొనిగల ఎలిశమ్మ, ఎర్రబాలెం సర్పంచ్ నాగరాజు సాదినేని లక్ష్మి ప్రసన్న శ్రీనివాసరావు సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మల్లె తోటల తెగుళ్ల పరిశీలన

విశాలాంధ్ర- చీరాల రూరల్ : మండలంలో కావూరివారిపాలెం పంచాయితీలోని రైతులు మల్లెపూల తోటలు తెగుళ్ళు బారిన పడి పూర్తిగా పాడవుతున్నాయని రైతు భరోసా కేంద్రం లో ఫిర్యాదు చేశారు. చీరాల మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి సిబ్బందితో కలసి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మల్లెపూలు కావూరివారిపాలెం, చుట్టు పక్కల గ్రామాలు పూర్తిగా మల్లెపూలపై ఆధారపడి అనేక కుటుంబాలకు జీవనాధారంగా ఉండేవన్నారు. ఇక్కడ నుండి మల్లెపూలు హైదరాబాద్, ఒంగోలు, గుంటూరు, వంటి మహానగరాలకు సరఫరా చేసే వారని తెలిపారు.

పేద విద్యార్థుల తలరాతలు మార్చేందుకే సంస్కరణలు: ఎంపీ

విశాలాంధ్ర - రేపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల తలరాతలు మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. పట్టణంలోని శ్రీ సీతారామకల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అమ్మఒడి నిధుల పంపిణీ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాకూడదని భావించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పేద విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదని విద్యార్థులకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. చదువుకునే విద్యార్థులు చిరిగిన బట్టలు అరిగిన చెప్పులు తెగిన బ్యాగులతో ఉండకూడదనే సంకల్పంతో జగనన్న విద్యా కానుక కిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పిల్లలు తమ కంటే గొప్పగా ఎదగాలనే తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా చదువుకునే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు అమ్మఒడి పథకం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పాఠశాలల్లో మూడవ తరగతి నుండి సబ్జెక్టు టీచర్లను ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించే విధంగా టోఫెల్‌లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారి బైలింగువల్ (ద్విభాషా తెలుగు, ఇంగ్లీష్) లో పాఠ్యపుస్తకాల ముద్రణ చేయటం విద్యారంగం పట్ల సీఎంకు ఉన్న దూర దృష్టికి నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోధనా తరగతులు ప్రవేశ పెట్టిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించేందుకు, రోజు మంచి మెనూతో కూడిన భోజనం, చిక్కీలు, రాగి జావా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వేల పాఠశాలలను నాడు నేడు పనుల ద్వారా అభివృద్ధి చేసి వాటి రూపురేఖలు కార్పొరేట్‌కు దీటుగా మార్చారన్నారు. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు హాస్టల్ ఖర్చులు, మెస్ చార్జీలు కోసం వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని విద్యార్థులకు వసతి దీవెన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్నింటికి నాలుగు సంవత్సరాలలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. 66 వేల 722 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్టు చెప్పారు. ఇవే కాకుండా అణిముత్యాల పేరుతో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక నగదు బహుమతులు అందిస్తూ విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.జె.రామారావు, బుడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, ఆర్డీవో జగన్నాథం పార్థసారథి మున్సిపల్ కమిషనర్ విజయ్ సారధి, చైర్మన్ కట్టా మంగ, మండల విద్యాశాఖ అధికారులు నవీన్ కుమార్, శ్రీ హరి, సురేష్, శ్రీధర్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గడ్డ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో దిట్ట డీఎస్పీ లక్ష్మయ్య: ఎస్పీ

విశాలాంధ్ర- బాపట్ల : నేర నియంత్రణలో దిట్ట డీఎస్పీ గోలి లక్ష్మయ్య అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గుంటూరు ఇంటలిజెన్స్ డిఎస్పీగా బదిలీపై వెళుతున్న నేపథ్యంలో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణలో విశేష అనుభవమున్న డిఎస్పీ బదిలీపై వెళ్లడం తీరని లోటన్నారు. జిల్లా డి.సి.ఆర్.బి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ప్రతి అంశముపై స్పష్టమైన అవగాహన ఉండేదన్నారు. కేసుల దర్యాప్తులో ఏవైనా లోపాలుంటే వెంటనే సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చేవారన్నారు. కొత్తగా బాపట్ల జిల్లా ఏర్పడిన సమయంలో జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించుటలో లక్ష్మయ్య మంచి సహకారం అందించారన్నారు.ఈ సందర్భంగా బదిలీ పై వెళుతున్న డి.ఎస్.పి మాట్లాడుతూ ఉన్నతాధికారులు తమకు ఇచ్చిన బాధ్యతలును జిల్లా పోలీస్ అధికారుల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించానన్నారు. ఉన్నతమైన విలువలున్న జిల్లా ఎస్పీ వద్ద విధులు నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉన్నదన్నారు. ఈ వీడ్కోలు అభినందన సభలో అదనపు ఎస్పీ మహేష్, రేపల్లె డిఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డిఎస్పీ టి.వెంకటేశ్వర్లు, చీరాల డిఎస్పీఎస్. ప్రసాద్‌రావు ఏ.ఆర్ డిఎస్పీ ఏమ్.డి.హెచ్ ప్రేమ్ కుమార్, ఎస్.బి సీఐ ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కాలేజీ అధ్యాపకురాలికి అవార్డు

విశాలాంధ్ర - వేటపాలెం : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యాపకురాలు డా. డి.వి.ఎస్. సుకన్య యాక్టివ్ ఎస్.పి.ఒ.సి అవార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం యన్.పి.టి.ఇ.యల్ మినిస్ట్రీ ఆఫ్ హుమన్ రిసోర్స్ అండ్ డెవలప్మెంట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, మద్రాసు వారిచే ఆన్‌లైన్ సర్టిఫికెషన్ కోర్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాదిలో స్వయం యన్.పి.టి.ఇ.యల్ నిర్వహించిన పరీక్షలలో కళాశాల నుంచి 302 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ పరీక్షలలో ఒకరు గోల్డ్ మెడల్, 5గురు టాపర్స్, 32 మంది సిల్వర్ మెడల్స్, 125 మంది ఎలైట్ మెడల్స్ తో పాటు 144 మంది సర్టిఫికెట్లు మొత్తం 302 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు తెలిపారు. ఈ పరీక్షలలో స్పెషల్ విభాగంలో బి.టెక్ (సి.యస్.ఇ బ్రాంచి) 3వ ఏడాది చదువుతున్న విద్యార్థి షేక్ జమీర్ బాషా 3కోర్సులలో టాపర్‌గా నిలిచి యన్.పి.టి.ఇ.యల్ సూపర్ స్టార్ అవార్డును పొందారని తెలిపారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని కొత్తపాలెం మండల పరిషత్ పాఠశాలలో ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న 90మంది విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బారావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రత అలవర్చుకోవాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతాల విద్యార్థుల విద్యాభివృద్ధికి సంఘం కంకణం కట్టుకొని సేవాకార్యక్రమాలు చేస్తుందన్నారు. సంఘం సీనియర్ సభ్యులు, దత్తక్షేత్రం కన్వీనర్ కె.ప్రమీలదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మెడిటేషన్ చేస్తూ, ఆధ్యాత్మికత అలవర్చుకొనీ ఉన్నత విద్యాభివృదికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రావి మస్తాన్ రెడ్డి, గుడిమోటి శేఖర్ బాబు, చుండూరు నాగాంజనేయులు, గొడవర్తి రామకృష్ణ, వుటుకూరి కోటిస్వామి గుప్త, ప్రధాన అద్యాపకురాలు షేక్ ఖాదర్ ఉన్నిసా, అధ్యాపకులు, సంఘం ఉపాధ్యక్షులు బుర్ర సాంబశివరావు, మువ్వల శ్రీనివాసరావు, అరుణ, కాశీ చందు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కుందేరుపై సంపత్ నగర్ బ్రిడ్జి పొడవు పెంచండి

విశాలాంధ్ర - చీరాల : సంపత్ నగర్ కాలనీ నుంచి చీరాల రహదారిలోని కుందేరుపై ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జిని వెడల్పుతో పాటు పొడవు కూడా పెంచాలని ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.బుధవారం చీరాల ఆర్‌అండ్ బి డిఈని కలసి చీరాల అభివృద్ధిలో భాగంగా కుందేరు ఆక్రమణలు ఆగాలంటే కుందేరుపై నిర్మిస్తున్న బ్రిడ్జి వెడల్పుతో బాటు పొడవు పెంచాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుందేరు అభివృద్ధి పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ముందుగా కుందేరు ప్రవహించే నాలుగు రహదారులపై నాలుగు బ్రిడ్జిలు నిర్మించా లన్నారు. చిన్నపాటి వర్షానికే చీరాల పట్టణంలో మోకాలిలోతు నీరు నిలుస్తుందని,భారీ నుంచి అతి భారీ వర్షాలు పడితే చీరాల పట్టణమంతా ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. రాజకీయాలు వద్దు కుందేరు అభివృద్ధి ముద్దు అని అంత కలసి కట్టుగా చీరాల అభివృద్ధిలో భాగస్వామ్యులమై భవిష్యత్తు తరాలకు అభివృద్ధి చెందిన ప్రమాదం లేని చీరాలను అందిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి నాయకులు శీలం రవికుమార్, సీపీఎం నాయకులు బాబూరావు,దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని పాల్గొన్నారు.

పంట సాగు సాయం ఎకరాకు రూ.10 వేలు అందించాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమానికి కార్యచరణపై బుధవారం సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కే.వి.వి ప్రసాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు 10 వేలు సాగు సాయం అందించాలన్నారు. నేటి ప్రభుత్వాల తీరుతో రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వాలు అటకెక్కించాయని ప్రసాద్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మామిళ్ళపల్లి హరిబాబు, వీరయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల గ్రామంలో విత్తన దుకాణాలలో తాసిల్దార్ బి.సుశీల, మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శ్రీనివాసరావులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విత్తన దుకాణంలో ఉన్న స్టాక్ లిస్టును పరిశీలించారు. రైతులకు సరుకు అమ్మిన వెంటనే కంపెనీ పేరుతో సహా రశీదు ఇవ్వాలని తాసిల్దార్ బి.సుశీల సూచించారు. అదేవిధంగా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ లు రద్దు చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో పి. శ్రీనివాసరావు హెచ్చరించారు.

ఎన్‌సీసీలో సత్తా చాటిన సీఈసీ విద్యార్థులు

విశాలాంధ్ర - వేటపాలెం : ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా జాతీయస్థాయిలో జరిగిన ఎన్సిసి క్యాంపులో చీరాల ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. వడ్లమూడిలోని శ్రీ విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన శిబిరంలో కళాశాల నుంచి జి.శివ నాగబాబు, ఇ.సాయి త్రినాథ్, పి. గ్రేస్‌బ్యులా, టి.దివ్యశ్రీలు ప్రాతినిధ్యం వహించారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని 23 ఆంధ్రా బెటాలియన్ నుంచి ఇద్దరు బాలికలు ప్రాతినిధ్యం వహించగా వారు ఇద్దరు సిఇసి విద్యార్థులే కావటం గమనార్హం.ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. రవికుమార్ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్న ఈ శిబిరంలో తమ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ క్యాంపులో కూడా టాంగ్ ఆఫ్ వార్‌లో23 ఆంధ్ర బెటాలియన్ ప్రథమస్థానం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. సి. సి. ఆఫీసర్ హరీష్, సి.ఎస్.ఈ. సి. హెచ్ ఓ డి డాక్టర్ సౌజన్య, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కౌలు రైతు కార్డుల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం పొన్నపల్లి నడింపల్లి గ్రామాలలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిఆర్‌సి ఎంసి ఓబయ్య కోఆర్డినేటర్ యం.విజయనిర్మల డిడిఏ డిఆర్సి బాపట్ల డాక్టర్ వి.సురేఖ దేవి శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు కార్డుల ప్రాముఖ్యత ఖరీఫ్ సాగు ప్రణాళిక అనగా వాడకంపై రైతులకు అవగాహన విత్తన శుద్ధి ఎరువులు నీటి యాజమాన్యం సస్యరక్షణ వంటి కార్యక్రమాలపై రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన మేలు లేని దిగుబడిని ఎలా పొందాలో వారు రైతులకు వివరించారు. అంతేకాకుండా మట్టి నమూనా విధానం దాని వలన ప్రయోజనాల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఏం 'మాయ' చేశారో...!

- ప్రభుత్వ రికార్డుల మాయంపై కేసు నమోదు
- సమగ్ర విచారణకు రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు
- అధికారులే దొంగలంటున్న జర్నలిస్ట్ నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర - వేటపాలెం : కంచే చేను మేసిన చందాన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన వారే అక్రమార్కులకు అండగా నిలబడి భూ రికార్డులను మాయం చేసి అడ్డంగా బుక్కైన ఘటన చీరాల నియోజకవర్గం వేటపాలెంలో జరిగింది. వేటపాలెం డిప్యూటీ తహశీల్దారు జి.మహేశ్వరి ఫిర్యాదుతో పబ్లిక్ రికార్డుల దొంగతనంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లో కెళితే పందిళ్ళపల్లి రెవిన్యూ గ్రామ సర్వేనెంబర్ 72-3 పోరంబోకు గ్రామకంఠం ప్రభుత్వ భూమిలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ భారీ స్థాయి భవనాన్ని నిర్మించటంపై వేటపాలెంకు చెందిన జర్నలిస్ట్ యన్.నాగార్జునరెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమంచి భవనాన్ని నిర్మించిన భూరికార్డుల సమాచారం కోరుతూ 2021లో స.హ చట్టం కింద తహసీల్దార్ దరఖాస్తు చేశారు. తహసీల్దార్ నిరాకరించడంతో దరఖాస్తు విషయమై అప్పటి ఒంగోలు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో చెప్పిన మండల అధికారులు బేఖతారు చేశారు. వీటిని సవాలు చేస్తూ నాగార్జునరెడ్డి గతేడాదిలో అప్పటి రాష్ట్ర సమాచార కమిషనర్ ఎం.రవికుమార్ ఆశ్రయించారు. ప్రస్తుత స.హ చట్టం కమీషనర్ కట్టా జనార్దన రావుకు నాగార్జున రెడ్డి ఈ ఏడాదిలో మార్చిలో ఫిర్యాదు చేయటంతో అదే నెలలో రికార్డుల మాయంపై పూర్తి నివేదిక ఇవ్వాలని వేటపాలెం తహశీల్దారును ఆదేశించారు. రాష్ట్ర కమీషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దారు మహేశ్వరి నిష్పక్షపాతంగా విచారణ జరిపి రికార్డులు కనిపించటంలేదని విషయం నిజమేనని సమాచార కమీషనర్‌కు నివేదిక ఇచ్చారు. ఆర్టీఐ కమీషనర్ ఆదేశాల మేరకు భూరికార్డుల మాయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గతంలోనే ఇదే విషయంలో జర్నలిస్ట్ నాగార్జునరెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ప్రమేయంతోనే భూరికార్డులు మాయ మైయ్యాయని హైకోర్టును ఆశ్రయించగా కృష్ణమోహన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

- రాజకీయ ఒత్తిళ్లతోనే రికార్డు మాయం

ప్రభుత్వ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వ్యక్తుల ప్రయోజనాల కోసం పనిచేయటం వలనే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని నాగార్జునరెడ్డి ఆరో పించారు. ఇప్పటికైన అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజా ప్రయోజనాల కోసమే పని చేయాలని కోరారు. ప్రజల పట్ల వారి సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. లేని పక్షంలో ఏదో ఒకరోజు చట్టం ముందు దోషులుగా నిలబడవలసిన వస్తుందనటానికి ఈ కేసు ఉదాహరణ అన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

విశాలాంధ్ర-అద్దంకి : ముస్లీమ్ సోదరులకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ భక్తిభావం,కరుణ,సహనాన్ని బక్రీద్ చాటిచెబుతుంద న్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారన్నారు. అల్లాహ్ దయతో ప్రజలందరూ ఆరోగ్య సుఖ శాంతులతో జీవించాలని అందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

లోకేష్ పాదయాత్రలో నరేంద్రవర్మ

విశాలాంధ్ర-బాపట్ల : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నెల్లూరు జిల్లా కోటలో జరుగుతున్న యువగళం పాద యాత్రలో నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మీరు చేపడుతున్న పాదయాత్ర ప్రజలు హర్షిస్తున్నారని లోకేష్‌కు తెలిపారు. యువగళం పాదయాత్ర బాపట్ల నియోజకవర్గంలో నుంచే సాగేలా షెడ్యూల్ చేసుకోవాలని లోకేష్‌ను వర్మ కోరారు. బాపట్ల తెలుగు తమ్ముళ్లు మీ పాదయాత్ర కోసం ఎదురు చూస్తున్నారని తప్పక రావాలని కోరారు. నియోజకవర్గంలో పనితీరు మెరుగుపరిచావ్ శబాష్ వర్మ అంటూ లోకేష్ కితాబు ఇచ్చారు.

పట్టెం డేవిడ్‌కు ఆర్మీ విజయ్ అభినందనలు

విశాలాంధ్ర- బాపట్ల : క్రిష్టియన్ మైనార్టీ కార్పోరేషన్ జోనల్ చైర్మన్‌గా ప్రమాణా స్వీకారం చేసిన పట్టెం డేవిడ్ మనోహర్‌కు యువ పారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్ అభినందనలు తెలిపారు. బాపట్ల సీబీజెడ్ చర్చిలో బుధవారం జరిగిన ప్రమాణాస్వీకారం కార్యాక్రమంలో కార్పోరేషన్ స్టేట్ చైర్మన్ మేడిద జాన్సన్, ఎమ్మెల్సీ పోతుల సునీత, ప్రముఖ సమాజసేవకులు మోపర్తి జాన్, మణిభూషణ్‌లు పట్టెం డేవిడ్‌కు అభినందనలు తెలిపారు.

వేగేశన బక్రీద్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- బాపట్ల : బక్రీద్ పండుగ జరుపుకుంటున్న ముస్లీం సోదరులకు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలంతా సుభి క్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించా లని కోరారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు.

తహశీల్దార్ నెహ్రూ బాబు బాధ్యతలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల తహశీల్దార్‌గా కె.నెహ్రూ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అయన పర్చూరు మండల తహశీల్దార్‌గా పని చేస్తూ బది లీపై నిజాంపట్నంకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహశీల్దార్ ఎం.శిరీష బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ కె.నెహ్రూ బాబు మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

సేవా దృక్పథంతోనే 'రోటరీ' ఆవిర్భావం

విశాలాంధ్ర - పర్చూరు : సమాజ సేవా దృక్పదముతో ఆవిర్భవించినదే రోటరీ అని రోటరీ జిల్లా అధ్యక్షులు తాళ్ల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ఇడుపులపాడు నందు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, పండరీపురం, మార్టూరు వారి సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు, శుద్ధ జల ప్లాంటు, చేతులు శుభ్రం చేసుకునే సదుపాయాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అంతర్జాతీయ సేవలలో రోటరీ ముందంజములో ఉన్నదని, పాఠశాలల మౌలిక సదుపాయాలకు రోటరీ అధిక ప్రాధాన్యతనిచ్చి సేవలందిస్తుందని ఆయన తెలిపారు. పాఠశాల యాజమాన్యం, కమిటీ ప్రతినిధులు రోటరీ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు పాఠశాల కమిటీ అధ్యక్షులు బొగ్గవరపు చెంచు పున్నయ్య, కమిటీ కార్యవర్గ సభ్యులు గోరంట్ల పృధ్వి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడపర్తి పేరిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వేటపాలెం : పుల్లరిపాలెం రైతు భరోసా కేంద్రంలో బుధవారం కౌలు రైతు గుర్తింపు కార్డు లు గురించి అవగాహన సదస్సు జరిగింది. మండల వ్యవసాయ అధికారి ఐ.కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డ్ (సి.సి.ఆర్.సి. కార్డులు) తీసుకోవడం వలన కౌలు రైతు కూడా వ్యవసాయ శాఖకు సంబంధించి అన్ని పథకాలకు అర్హులు అవుతార న్నారు. ఈ కార్యక్రమంలో విఏఏ ఎన్.సాంబశివరావు, వీఆర్వో కృష్ణవేణి, కౌలు రైతులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.